# సాక్షి పల్నాడు

శుక్రవారం । 14 । జూన్ । 2024




### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన బొమ్మారెడ్డి శివమ్మ కుటుంబం రూ. లక్ష విరాళాన్ని అందించింది.



### బీసీజీ వ్యాక్సినేషన్

నాదెండ్ల: మండలంలోని అన్ని సచివాలయాల్లో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ నిర్వహించారు. గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్ నాయక్ పర్యవేక్షించారు.



### పోలేరమ్మ దేవస్థానం వార్షికోత్సవం

రెంటచింతల: పలనాటి కోనసీమగా పేరొందిన మంచికల్లు గ్రామంలోని పోలేరమ్మ దేవస్థానం 12వ వార్షికోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### పాఠశాల స్థాయిలోనే లక్ష్య నిర్దేశం జరగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే కెరీర్‌ను ఎంపిక చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని ఎంపిక చేసిన 20 పాఠశాలల పరిధిలోని 70 మంది ఉపాధ్యాయులతోపాటు, 20 మంది హెచ్‌ఎంలు, నలుగురు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ అధ్యాపకులకు కెరీర్ ఎడ్యుకేషన్ శిక్షణ కార్యక్రమాన్ని చంద్రమౌళినగర్‌లోని భాష్యం హైస్కూల్‌లో నిర్వహించారు. డీఈఓ పి.శైలజ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబోధనతోపాటు, భవిష్యత్తులో వారి కెరీర్‌ను ఉన్నతంగా మలచుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించాలని సూచించారు. గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీస్ సీఈఓ రాక్వెల్ ప్రాప్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏఎంఓ ప్రసాద్, ఏఎస్ఓ జయశంకర్, శిక్షకులు మంజునాథ, అనూష పాల్గొన్నారు.

### 39,659 బస్తాల మిర్చి విక్రయం




కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 39,445 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 39,659 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 16,800 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 19,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,394 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

### బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ దూరం



తెనాలిఅర్బన్: బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ వ్యాధి దూరమవుతుందని రాష్ట్రీయ బాల స్వాస్థ్య రాష్ట్ర నోడల్ ఆఫీసర్, వ్యాక్సినేషన్ జిల్లా పరిశీలకులు కె.ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు అర్బన్ హెల్త్ సెంటర్లలో జరుగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన వృద్ధులకు మొదటి విడత వ్యాక్సిన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. అందరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. అర్హులైన వారు వెంటనే తమ పేర్లు వార్డు సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ, హెల్త్ విజిటర్ పాగోలు వెంకటేశ్వరమ్మ, ఏఎస్‌ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 810.40 అడుగుల వద్ద ఉంది.

### నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3500, గరిష్ట ధర రూ.5600, మోడల్ ధర రూ.4400 వరకు పలికింది.

# విత్తనాలకు సలాం

- సార్వాకు అనుకూల వంగడాలు
- తెగుళ్లను తట్టుకుంటాయి
- లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఏరువాక కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్తలు వెల్లడి



ఎం.వెంకటరాములు

గుంటూరు రూరల్: రాష్ట్రంలోని కృష్ణ మండలంలో సార్వా సాగుకు అనుకూలమైన వరి విత్తన రకాలెన్నో ఉన్నాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఏరువాక కేంద్రం విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు తెలిపారు. రైతులు సరైన వంగడాలు ఎంచుకుని అధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. ఆయనతోపాటు మృత్తిక శాస్త్రం సీనియర్ ప్రొఫెసర్, కో–ఆర్డినేటర్ డాక్టర్ జి. కిషోర్‌బాబు, కీటక శాస్త్రం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.నగేష్‌లు ఖరీఫ్‌ను అనువైన మేలైన విత్తన రకాల గురించి వివరించారు. ఈ రకాలు సాగు చేయడం వల్ల కాండం దృఢంగా ఉంటుందని వెల్లడించారు. చేను పడిపోకుండా, దోమను, ఎండాకు తెగుళ్లను తట్టుకుంటుందని చెప్పారు. మంచి గింజనాణ్యత కలిగి అధిక దిగుబడిని ఇచ్చే రకాలను ఎంచుకోవాలని స్పష్టం చేశారు. వారు సూచించిన కొన్ని విత్తన రకాలు ఇవీ..

## సిరులు ‘వరి’ంచు

**మార్టేరు మసూరి (ఎంటీయూ 1262)**

మార్టేరు మసూరి 155 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ఎండాకు తెగులు, దోమపోటును తట్టుకుంటుంది. కాండం దృఢంగా ఉండి చేనుపై పడిపోకుండా ఉంటుంది. గింజ రాలకుండా ఉంటుంది. ఎక్కువ నిల్వ ఉంటుంది. అధిక దిగుబడినిస్తుంది. ముందుగా నాటుకున్నా, ఎరువులు ఎక్కువగా వేసుకున్నా కాలపరిమితి పెరగటానికి అవకాశం ఉంది. ఎకరానికి 2.6 టన్నుల నుంచి 2.8 టన్నుల దిగుబడిని ఇస్తుంది.

**కృష్ణవేణి (ఎంటీయూ 2077)**

కృష్ణవేణి రకం 150 రోజుల్లో పంటకోతకు వస్తుంది. సుడిదోమను తట్టుకుంటుంది. సన్నబియ్యం గింజ రకం. చేనుపై రాలే అవకాశం ఉంటుంది. అందువల్ల కర్ర పచ్చిగా ఉండగానే కోయటం మంచిది. చేను నేలపై పడిపోదు. ఎండాకు తెగులు తట్టుకోలేదు. ఎకరానికి 2.5 టన్నుల దిగుబడినిస్తుంది.

**భావపురి సన్నాలు (బీపీటీ 2270)**

ఈ రకం ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉంటుంది. 160–165 రోజుల్లో పంటకోతకు వస్తుంది. ఎండాకు తెగులు, దోమను తట్టుకుంటుంది. చేను పడిపోదు. సన్నబియ్యం అన్నానికి బాగుంటుంది. ఒకే పంటను పండించు ప్రాంతాలకు అనుకూలం. దిగుబడి ఎకరానికి 2.8 టన్నులు ఇస్తుంది.

**నెల్లూరు సిరి (ఎస్ఎల్ఆర్ 4001)**

సార్వా, దాళ్వా రెండు పంటలకూ అనుకూలం. 140–145 రోజుల్లో పంటకోతకు వస్తుంది. అగ్గి తెగులు, దోమ పోటును కొంత వరకూ తట్టుకుంటుంది. తెల్ల పొట్టును కలిగి ఉంటుంది. సన్నబియ్యం రకం. తక్కువ నత్రజనితో ఎక్కువ దిగుబడి ఇస్తుంది. ఎకరానికి 2.6–2.8 టన్నుల దిగుబడి ఇస్తుంది.

**ఇవీ విత్తుకోవచ్చు..**

ప్రకాశం జిల్లాకు ఎస్ఎల్ఆర్ 9674, పార్థివ, స్వర్ణముఖి, అక్షయ, భావపురి సన్నాలు, బాపట్ల మసూరి, ఎంటీయూ రైస్ 1310, ఎంటీయూ రైస్ 1321, బీపీటీ రైస 2846, ఎంసీఎం రైస్ 103 రకాలు అనుకూలంగా ఉంటాయి. ముంపు ప్రాంతాల్లో ఎంటీయూ రైస్ 1232, భాడవ మసూరి, అమర, ఇంద్ర, భీమ తదితర రకాలూ అనుకూలమైనవి. చౌడు ప్రాంతాల్లో ఎంటీయూ రైస్ 1293, ఎంసీఎం రైస్ 103, ఇంద్ర పాండురంగ వంటి రకాలు సాగు చేసుకోవచ్చు.




సాంబ మసూరి

### తేజా (బీపీటీ 2295)

తేజా రకం 150–155 రోజుల్లో పంటకోతకు వస్తుంది. సుడిదోమ, అగ్గితెగులును కొంత వరకూ తట్టుకుంటుంది. ఒకే పంటను పండించే ప్రాంతాలకు అనువైన రకం. సన్నగింజ రకం. చేను పడిపోదు. అన్నానికి అనుకూలంగా ఉంటుంది.



### సాంబ మసూరి (బీపీటీ 5204)

సాంబమసూరి ఖరీఫ్, రబీ రెండు పంటలకూ అనుకూలం. సన్నని బియ్యం. అన్నం మృదువుగా రుచిగా ఉంటుంది. మెతుకులు ఒకదానికి ఒకటి అతుక్కోవు. అన్నం ఎక్కువగా వదుగుతుంది. ముదురు నారు నాటేందుకు అనుకూలమైన రకం. ఎకరానికి 2.5 టన్నుల దిగుబడినిస్తుంది.

### మార్టేరు సాంబమసూరి (ఎంటీయూ 1224)

మార్టేరు సాంబ మసూరి పంట 135 రోజులకు వస్తుంది. దోమపోటును తట్టుకుంటుంది. చేను పడిపోదు. బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి అనుకూలంగా ఉంటుంది. ఎండాకు తెగులు తట్టుకోలేదు. ఎకరానికి 2.6 టన్నులనుంచి 2.8 టన్నులు దిగుబడి ఇస్తుంది.



### ఎంటీయూ రైస్ 1318



ఎంటీయూ రైస్ 1318 రకం పంటకాలం 150 రోజులు. అగ్గితెగులు, మెడవిరుపు, పొట్టకుళ్లు తెగుళ్లను తట్టుకుంటుంది. కాండం దృఢంగా ఉంటుంది. చేనుపై పడిపోదు. తక్కువ నత్రజని ఎరువులతో అధిక దిగుబడిని ఇచ్చే రకం. గింజ మధ్యస్థ సన్నంగా ఉండి పచ్చి బియ్యానికి అనుకూలం. బియ్యం పారదర్శకంగా ఉండి ఎక్కువ నిండు గింజలు కలిగి ఉంటుంది. ముందుగా నాటుకున్నా, అత్యధిక ఎరువులు చల్లుకున్నా కాల పరిమితి పెరిగేందుకు అవకాశం ఉంది. పంట దిగుబడి ఎకరానికి 3 టన్నులు ఇస్తుంది.

### ఇంద్ర (ఎంటీయూ 1061)



ఇంద్ర ఎంటీయూ 1061 సుడిదోమను తట్టుకుంటుంది. సన్న గింజ, తెలుపు కలిగి ఉంటుంది. పడిపోదు. 10 రోజుల వరకూ ముంపును తట్టుకుంటుంది. కొద్దిపాటి చౌడు భూములను తట్టుకునే రకం. అన్నానికి అనుకూలం. ఎకరానికి 3 టన్నుల దిగుబడినిస్తుంది.

### స్వర్ణ (ఎంటీయూ 7029)



స్వర్ణ ఎంటీయూ 7029 రకం 150 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ఎండాకు తెగులును తట్టుకుంటుంది. వివిధ రకాల భూముల్లోనూ వాతావరణ పరిస్థితుల్లోనూ రెండు పంటలను పండించుకోవచ్చు. స్థిరమైన దిగుబడి ఇచ్చే సన్న గింజరకం. తక్కువ నత్రజనితో అధిక దిగుబడినిస్తుంది. ఎకరానికి 3 టన్నుల దిగుబడి వస్తుంది.

# మోగిన బడిగంట

- ఒక్కరోజు ఆలస్యంగా తెరుచుకున్న బడి తలుపులు
- జిల్లాలో 1,599 ప్రభుత్వ, 442 ప్రైవేటు పాఠశాలలు
- బడి బాట పట్టిన 3,17,726మంది విద్యార్థులు
- నేటి నుంచి విద్యార్థి కిట్లు పంపిణీ



నరసరావుపేట ఈస్ట్: వేసవి సెలవుల అనంతరం తిరిగి గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఇన్నిరోజులు ఆటపాటలతో గడిపిన చిన్నారులు బొమ్మలను, కామిక్స్‌ను, వీడియో గేమ్స్‌ను అటకెక్కించి పుస్తకాల సంచి భుజాన వేసుకొని బడి బాట పట్టారు.

**నేటి నుంచి విద్యార్థి కిట్లు పంపిణీ...**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యార్థి కిట్లు (జగనన్న విద్యా కానుక)పంపిణీ చేయనున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి అవసరమయ్యే విద్యా కానుక కిట్లను గత జగనన్న ప్రభుత్వం సిద్ధంగా ఉంచింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బడులు తెరిచిన మొదటి రోజే జగనన్న విద్యా కానుక విద్యార్థి చేతిలో ఉండేలా ప్రణాళిక రూపొందించింది. పాఠశాల స్థాయిని బట్టి ప్రతి కిట్‌లో మూడు జతల యూనిఫామ్, బెల్ట్, షూలు, డిక్షనరీ, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, స్కూల్ బ్యాగ్‌తో కలిపి తొమ్మిది రకాల వస్తువులు ఉంటాయి. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థి ఒక్క పైసా కూడా వ్యయం చేయకుండా విద్యాసంవత్సరం పూర్తి చేసుకునేలా దాదాపు రూ.2,500లు విలువైన విద్యా సామగ్రిని ప్రతి విద్యార్థికి అందించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకొంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పంపిణీ చేసేందుకు జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధంగా ఉన్నాయి.

### 1,54,946 మంది విద్యార్థులకు లబ్ధి..

జిల్లా వ్యాప్తంగా 1,599 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1,54,946 మంది విద్యార్థులకు విద్యార్థి కిట్లు అందనున్నాయి. వీటిలో 1072 ప్రాథమిక, 142 ప్రాథమికోన్నత, 246 ఉన్నత పాఠశాలలతో పాటు 73 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. మున్సిపల్ పాఠశాలలు 56 ఉన్నాయి. జిల్లాలో 14 ఏపీ మోడల్ స్కూల్స్, 10 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, 13 గిరిజన సంక్షేమ పాఠశాలలు, 24 కస్తూర్బా గాంధీ పాఠశాలలు ఉన్నాయి. ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు బాలురకు హాఫ్ హ్యాండ్ చొక్కా, నిక్కరు, 8,9,10 తరగతుల వారికి హాఫ్ హ్యాండ్ చొక్కా, ప్యాంట్ అందజేస్తారు. బాలికలకు 1,2తరగతుల వారికి హాఫ్ హ్యాండ్ చొక్కా, గౌన్, 3,4,5, తరగతుల వారికి హాఫ్ హ్యాండ్ చొక్కా, స్కర్ట్, 6 నుంచి 10వతరగతి విద్యార్థినులకు చున్నీతో చుడీదార్ అందజేయనున్నారు.

# లారీ ఢీకొని దంపతులు దుర్మరణం

- రాంగ్ రూట్‌లో వచ్చి బైకును ఢీకొట్టిన లారీ
- కుమార్తెను చూసి తిరిగివెళ్తూ అనంతలోకాలకు..



మృతి చెందిన బత్తుల కొండలు, లక్ష్మి

మేదరమెట్ల: కుమార్తెను చూసి తిరిగి బైక్‌పై వెళ్తున్న దంపతుల్ని జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ ఢీకొట్టడంతో దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం తిమ్మనపాలెం గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా రొంపిచర్ల సుబ్బారెడ్డి కాలనీకి చెందిన బత్తుల కొండలు (49), లక్ష్మి (41) దంపతులు ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడులో ఉంటున్న కుమార్తె వద్దకు వచ్చారు. గురువారం ఉదయం తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు మోటారు బైకుపై బయలుదేరారు. తిమ్మనపాలెం గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా రాంగ్ రూట్‌లో లారీ వచ్చి ఢీకొట్టింది. బైకుపై ఉన్న దంపతులిద్దరూ రోడ్డుపై పడిపోయారు. వారి మీదుగా లారీ వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మోటారు బైకు లారీ ముందుభాగంలో కింది వైపు ఇరుక్కుపోయింది. సమాచారం అందుకున్న మేదరమెట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుల బంధువులకు సమాచారం అందజేశారు. అద్దంకి రూరల్ సీఐ శివరామ కృష్ణారెడ్డి ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాల్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. లారీ ఇడుపుగల్లు నుంచి కందుకూరుకు టైల్స్ లోడుతో వెళ్తున్నట్లు తెలిసింది.



లారీ ముందు భాగంలో ఇరుక్కుపోయిన బైకు

### పుస్తకాల పంపిణీని త్వరితగతిన పూర్తిచేయాలి



పుస్తకాల పంపిణీని పరిశీలిస్తున్న లింగేశ్వరరెడ్డి

యద్దనపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలని గుంటూరు ఆర్‌జేడీ బి. లింగేశ్వరరెడ్డి సూచించారు. మండల కేంద్రం యద్దనపూడిలో గురువారం స్టూడెంట్ కిట్లు, పాఠ్య పుస్తకాల పంపిణీని ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు ? ఇంకా ఎన్నిటికి పంపిణీ చేయాలి ? అనే విషయాన్ని ఎంఈవో చిలుకూరి గోపిని అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో విద్యార్థులకు అందిస్తున్న బూట్లు కొలతల విషయంలో వ్యత్యాసం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అనంతరం యద్దనపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని చెప్పారు. బోధనలో ఐఎఫ్‌పీ ప్యానెల్‌ను ఎక్కువగా ఉపయోగించాలని, తద్వారా విద్యార్థులు చక్కగా గుర్తుంచుకోగలుగుతారని సూచించారు.

# మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

సమగ్ర శిక్ష ఏపీసీ ఎం.వి.సుధాకర్

బాపట్ల టౌన్: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.వి.సుధాకర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని మున్సిపల్ హైస్కూలులో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన సూచించారు.

# గమనం.. గమ్యం భద్రం

- రహదారి భద్రతపై యువతకు అవగాహన
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- డ్రైవింగ్ లైసెన్సు లేని వారిపై కఠిన చర్యలు
- ఆర్టీఏ కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలపై శిక్షణ కార్యక్రమం

**జిల్లాలో ప్రమాదాలు ఇలా..**

| సంవత్సరం | ప్రమాదాలు | మరణాలు | క్షతగాత్రులు |
|---|---|---|---|
| 2022 | 1,084 | 422 | 1,014 |
| 2023 | 965 | 328 | 1,503 |
| 2024 | 167 | 59 | 157 |



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీం



శిక్షణకు హాజరైన యువకులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): సురక్షిత ప్రయాణం గమ్యానికి భద్రంగా చేరవేస్తుంది. అందుకే రహదారి భద్రత, ట్రాఫిక్‌పై పూర్తి అవగాహన కల్పించే దిశగా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు అడుగులు వేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని సూచిస్తున్నారు. గుంటూరు జిల్లాలోని స్వర్ణభారతినగర్ ఆర్టీఏ కార్యాలయానికి పలు పనుల నిమిత్తం నిత్యం వచ్చే వేలాది మంది వాహనదారులకు రహదారి భద్రత, సిగ్నల్స్‌పై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. నిబంధనలను వివరిస్తున్నారు.

**ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు**

రహదారి భద్రతపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ఆర్టీఏ కార్యాలయంలో డీటీసీ షేక్ కరీం నేతృత్వంలో చేపట్టారు. రోజూ ఎల్ఎల్ఆర్, డీఎల్‌ల కోసం సుమారు 250 నుంచి 300 మంది కార్యాలయానికి వస్తుంటారు. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన అనంతరమే ఎల్ఎల్ఆర్, డీఎల్ అందిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు విశాఖపట్నం, విజయవాడలో మాత్రమే ఉన్న సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను గుంటూరులో కొత్తగా ప్రారంభించారు. ఈ సెంటర్లోనే ఎల్ఎల్ఆర్, డీఎల్ కోసం వచ్చేవారికి 50 మంది చొప్పున ఐదారు బ్యాచ్‌లు లెక్కన శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా మోటారు వెహికల్ యాక్ట్ విధానాలు, ప్రమాదాలు, వాటి పర్యవసనాలు గురించి వివరిస్తున్నారు. ప్రమాదాల చిత్రాలు, లఘు చిత్రాల ఆధారంగా అవగాహన కల్పిస్తున్నారు. లైసెన్సుల కోసం వచ్చే యువకుల తల్లిదండ్రులకూ అవగాహన కార్యక్రమం కొనసాగుతోంది. నిత్యం సుమారు 30 నిమిషాలకు పైగా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు.

**చట్టాలను ఉల్లంఘిస్తే..**

చట్టాలు ఉల్లంఘిస్తే జరిగే దుష్పరిణామాలపైనా ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జరిమానాలు, కోర్టు విధించే శిక్షలను బోర్డుల ద్వారా ప్రదర్శిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపితే మోటారు వెహికల్ సెక్షన్ 181 ప్రకారం మూడు నెలలు జైలు శిక్ష, రూ. 5వేలు జరిమానా పడే అవకాశం ఉందని చెబుతున్నారు. సెక్షన్ 183 (1) ప్రకారం మితిమీరిన వేగానికి జరిమానా రూ. 2వేలతోపాటు, జైలు శిక్ష, స్నేక్, ర్యాష్, నెగ్లిజెన్స్ డ్రైవింగ్‌కు 184 సెక్షన్ ప్రకారం ఆరు నెలల నుంచి సంవత్సరం వరకు జైలు శిక్ష, రూ. 5వేల వరకు జరిమానా, మద్యం సేవించి వాహనం నడిపితే మొదటి నేరానికి రూ.10వేలు లేకుంటే ఆరు నెలలు జైలు శిక్ష, తదుపరి దొరికితే రూ. 15వేలు జరిమానా, రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష, ఆ తర్వాత కూడా మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసే అధికారం అధికారులకు ఉంటుందని వివరిస్తున్నారు. సీటు బెల్టు లేకుండా నడపడం ద్వారా సెక్షన్ 194 (బీ) ప్రకారం రూ. వెయ్యి జరిమానా, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం ద్వారా సెక్షన్ 194(బీ) ప్రకారం రూ. వెయ్యి జరిమానా, మూడు నెలల వరకు లైసెన్సు రద్దు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. మితిమీరి ప్రయాణికులను ఎక్కించుకుంటే సెక్షన్ 194(ఏ) ప్రకారం కేసు నమోదు చేస్తామని వెల్లడిస్తున్నారు.

### యువత, విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నాం

రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎందరో మరణిస్తున్నారు. ఎన్నో జీవితాలు నాశనమవుతున్నాయి. వీటిని అరికట్టేందుకు ప్రజలకు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. లైసెన్సుల కోసం వచ్చేవారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. యువత, విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాలు చేపట్టాం.

– షేక్ కరీం, డీటీసీ



ట్రాఫిక్ సిగ్నల్స్, ప్రమాదాల సూచికలు తెలియజేసే బోర్డులు

## క్లుప్తంగా

### చిన్నారి నృత్యానికి ముగ్ధులైన త్రిపుర గవర్నర్



**తెనాలి:** ఎనిమిదేళ్ల వయసులోనే కూచిపూడి నృత్యంలో ప్రావీణ్యం చూపుతున్న చిన్నారి గ్రీష్మశ్రీ నాట్య ప్రదర్శనను బుధవారం సాయంత్రం తిలకించిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ముగ్ధులయ్యారు. గ్రీష్మశ్రీని అభినందించారు. స్థానిక కొత్తపేటలోని రావి రంగయ్య మున్సిపల్ హైస్కూలు ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి, అరుణకుమారి దంపతులు తమ కుమార్తె గ్రీష్మశ్రీకి చిన్ననాటి నుంచి కూచిపూడి నాట్యం నేర్పిస్తున్నారు. అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న ఆ చిన్నారి ఎందరో ప్రముఖుల ప్రశంసలతోపాటు పలు రాష్ట్రాల గవర్నర్ల అభినందనలు అందుకుంది. కర్ణాటక రాజ్‌భవన్‌లో ఆ రాష్ట్ర గవర్నర్ థవార్‌చంద్ గెహ్లాట్ ముందు నాట్య ప్రదర్శన ఇచ్చింది. హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ హైదరాబాద్ వచ్చినపుడు ఆయన ఎదుట నృత్యకౌశలాన్ని ప్రదర్శించింది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం హైదరాబాద్ వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఎదుట గ్రీష్మశ్రీ కళా ప్రతిభను చాటింది. ముగ్ధులైన ఇంద్రసేనా రెడ్డి గ్రీష్మశ్రీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీష్మశ్రీ తల్లి అరుణకుమారిని, సోదరుడు అరవింద్‌రెడ్డి ఉన్నారు.

### ఉర్దూ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

**గుంటూరు ఎడ్యుకేషన్:** పాతగుంటూరు నందివెలుగురోడ్డులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీ (ఉర్దూ బాలుర) జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శిరీష గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు గత మార్చిలో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 18లోపు అడ్మిషన్ పొందాలని, ఇందు కోసం సామాజిక వర్గ ధ్రువీకరణ పత్రం విధిగా వెంట తెచ్చుకోవాలని తెలిపారు. వివరాలకు 87126 25073, 98495 59611 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# అంగన్‌వాడీలను సత్వరం విధుల్లోకి తీసుకోవాలి

- లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం
- సీఐటీయూ పల్నాడు జిల్లా కమిటీ

**నరసరావుపేట:** ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారన్న నెపంతో విధుల నుంచి తొలగించిన అంగన్‌వాడీలను సత్వరమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ పల్నాడు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్ కలిసి విన్నవించారు. ఆ సమయంలో తాను ఇక్కడ విధుల్లో లేని నేపథ్యంలో నరసరావుపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు విన్నవించాలన్న జిల్లా కలెక్టర్ సూచన మేరకు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ కె.శివ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎన్నికల నిబంధన నియమావళి ఉల్లంఘించారనే నెపంతో అంగన్‌వాడీలను తొలగించారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలు అంగన్‌వాడీ ఉద్యోగుల ఇళ్లకు వచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్న సందర్భంగా తీసిన ఫొటోలను ఉపయోగించి రాజకీయ కక్షతో కొంత మంది అంగన్‌వాడీ ఉద్యోగులపై ఫిర్యాదులు



ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేశారని, ఆ తప్పుడు ఫిర్యాదులను ఆధారంగా చేసుకొని చిరు ఉద్యోగులను తొలగించడం అన్యాయమన్నారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గుంటూరు మల్లీశ్వరి మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణలో అంగన్‌వాడీల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి తొలగించిన అంగన్‌వాడీలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే యూనియన్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. నరసరావుపేట ప్రాజెక్టు కార్యదర్శి నిర్మల, సాయి పాల్గొన్నారు.

## ఉర్దూ బడుల్లో విద్యార్థుల నమోదుకు ప్రత్యేక డ్రైవ్

**గుంటూరు ఎడ్యుకేషన్:** సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో మైనార్టీ విద్యార్థుల నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం గురువారం తెలిపారు. చౌత్రా సెంటర్లోని ఉర్దూ డీఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఖాసిం మాట్లాడుతూ ఇందులో భాగంగా ఈనెల 15 వరకు స్కూల్ విల్లింగ్‌నెస్ ఉత్సవాలను నిర్వహించి, బడి ఈడు పిల్లలను గుర్తించేందుకు ఆవాస ప్రాంతంలోని ప్రతి ఇంటిని సందర్శించి బాలికా విద్యకు గల ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంతోపాటు నిర్దేశించిన కార్యక్రమాలు పాఠశాలల్లో నిర్వహించాలని సూచించారు. ఈనెల 16 నుంచి 20వరకు వేడుక – విద్య కార్యక్రమంలో భాగంగా తరగతుల వారీగా విద్యార్థుల నమోదు, పాటల పోటీలు, ప్లే కార్డ్స్ నినాదాలతో ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, ఇంటింటి ప్రచార కార్యక్రమాలను



మాట్లాడుతున్న ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం

నిర్దేశించిన మేరకు నిర్వహించాలన్నారు. అదే విధంగా ఈనెల 21 నుంచి 29 వరకు వేడుకలు – ప్రవేశాలు అనే అంశంలో భాగంగా నిర్దేశించిన విధంగా రోజువారీ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా మైనార్టీ పిల్లలు, కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, నూరుశాతం నమోదు జరిగే విధంగా చూడాలన్నారు. ఆయా కార్యక్రమాల ప్రగతిపై రోజువారీ నివేదికను సమర్పించాలని సూచించారు. గుంటూరు జిల్లాలోని ఉర్దూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందు ఆయా అంశాలపై తగు చర్యలు తీసుకోవాలన్నారు.

### విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

**నకరికల్లు:** విద్యుత్‌షాక్‌కు గురైన వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని చల్లగుండ్ల సమీపంలోని హెరిటేజ్ డైరీ వద్ద బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. రేపల్లె మండలం బొబ్బరలంక గ్రామానికి చెందిన చాట్రగడ్డ రవికుమార్ (42) చల్లగుండ్లలోని హెరిటేజ్ డైరీలో గత ఏడాదికాలంగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి పాలలోడుతో వచ్చిన లారీలోని పాలను పరీక్షించేందుకు లారీ పైకి ఎక్కాడు. ఈ క్రమంలో పైన ఉన్న విద్యుత్‌తీగలు తగలడంతో తీవ్ర విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.నాగేందరరావు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### రెంటపాళ్లలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

**సత్తెనపల్లి:** ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన సంఘటన సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల ఎస్సీ కాలనీలో గురువారం జరిగింది. ద్విచక్ర వాహనం వేగంగా నడపడంపై ప్రశ్నించిన నేపథ్యంలో మాటకు మాట పెరిగి ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన పల్లె సందీప్, కారుమంచి రాకేష్, బండారు రవిలకు గాయాలయ్యాయి. ఈ ఘర్షణ జరుగుతుండగా ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియనివ్యక్తులు దహనం చేశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## సచివాలయంలో ఉద్యానవనం, ఫౌంటెయిన్ పునరుద్ధరణ

**తాడికొండ:** ఏపీ సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సచివాలయ ఆవరణలోని ఉద్యానవనాన్ని అన్ని హంగులతో పునరుద్ధరించినట్లు ఏపీ సీఆర్డీయే కమిషనర్ వివేక్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యానవనంలో చక్కని నీడనిచ్చే చెట్లు, పూల మొక్కలు, గ్రీన్ లాన్ తదితరాలను అందంగా ముస్తాబు చేయడంతో పాటు సందర్శకులను విశేషంగా ఆకర్షించే వాటర్ ఫౌంటెయిన్‌ను పునరుద్ధరించగా నీటి తుంపరలతో కనువిందు చేస్తుందని ఆయన తెలిపారు.

పునరుద్ధరించిన వాటర్ ఫౌంటేన్



# రెడ్‌క్రాస్ సేవలకు పోలీసుల సహకారం అవసరం

జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌ను కలిసి కోరిన చైర్మన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు

**నరసరావుపేట:** జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా జరిగే సేవా కార్యక్రమాలకు పోలీసులు సహాయ సహకారాలు అందజేయాలని ఆ సంస్థ ప్రతినిధులు జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌ను కోరారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి, ఆమెను సత్కరించారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలను గురించి వివరించారు. దీనికి స్పందించిన ఆమె రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలకు తమ డిపార్టుమెంట్ నుంచి



జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గార్గ్‌ను సత్కరించిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసగుప్తా, బత్తుల మురళీ, డాక్టర్ సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాణహాని ఉంది రక్షణ కల్పించండి

వైఎస్సార్ సీపీ కార్యకర్త పొట్లూరి శివయ్య

**సత్తెనపల్లి:** తనపై హత్యాయత్నం చేసిన టీడీపీ నాయకులను పోలీసులు రిమాండ్‌కు పంపించిన తర్వాత కూడా గ్రామంలోని కొందరు టీడీపీ నాయకులు చంపేస్తాం అంటూ బెదిరిస్తున్నారని, వారి నుంచి తనకు ప్రాణానికి హాని ఉందని తనకు రక్షణ కల్పించాలని వైఎస్సార్ సీపీ బట్లూరు గ్రామ కార్యకర్త, ఆర్‌ఎంపీ వైద్యుడు పొట్లూరి శివయ్య అన్నారు. గురువారం గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శివయ్య మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి బట్లూరు గ్రామంలో నిద్రిస్తున్న తనపై దాడి చేసిన శాఖమూరి నరేష్, తూమాటి గోపీకృష్ణ, మందడపు హరి సూర్య నారాయణలపై పల్నాడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే జిల్లా ఎస్పీ ఆదేశాలతో స్పందించిన సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు దాడి ఘటనపై గ్రామంలో విచారణ జరిపి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారన్నారు. రిమాండ్‌కు పంపించిన తర్వాత కూడా టీడీపీ నాయకులు గొడవలు వద్దు అనుకోకుండా మరింత కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. టీడీపీకి చెందిన శాఖమూరి షణ్ముకి తన తల తెచ్చిన వారికి రూ.15 లక్షలు ఇస్తామంటూ గ్రామంలో ప్రచారం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గురు ఒక్కొక్కరు రూ. 5 లక్షలు చొప్పున రూ.15 లక్షలు వేసుకుంటే పని అయిపోతుందని, అప్పుడైనా ఒకటే కేసు అంటూ రెచ్చగొడుతూ చంపేస్తాం అంటూ బెదిరిస్తున్నారన్నారు. ఈ వ్యవహారం అంతా చూస్తుంటే తన ప్రాణానికి హాని ఉందని తెలుస్తుందని, పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న యానాదుల సంఘం నేత బాపట్ల బ్రహ్మయ్య, పక్కన పొట్లూరి శివయ్య

**శివయ్యకు అండగా యానాదుల సంక్షేమ సంఘం..**

బట్లూరు ఆర్‌ఎంపీ వైద్యుడు పొట్లూరి శివయ్యకు యానాదుల సంక్షేమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాపట్ల బ్రహ్మయ్య అన్నారు. గురువారం సంఘ నాయకులతో కలిసి బట్లూరు గ్రామాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రజలు శాశ్వతమన్నారు. టీడీపీ కార్యకర్తలు చేసే దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయని, ప్రజలు దీనిపై ఆలోచన చేయాలన్నారు. బట్లూరులో శివయ్యపై జరిగిన దాడి అతిహేయమన్నారు. నిద్రిస్తున్న వ్యక్తి మీద మూకుమ్మడిగా మారణాయుధాలతో దాడి చేసి గాయపరచడం, ఆపై బెదిరింపులకు గురి చేయడం సరైనది కాదన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యానాదుల సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు మేకల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రమణ, మండల నాయకుడు పొట్లూరి సాంబశివరావు, మండల నాయకులు ఉన్నారు.

### హత్యాయత్నం కేసులో ముగ్గురు అరెస్ట్

- వైఎస్సార్ సీపీ కార్యకర్త శివయ్యపై ఈనెల 11న కత్తులతో దాడిచేసిన నిందితులు
- ముగ్గురికి రిమాండ్ విధించిన న్యాయమూర్తి

**సత్తెనపల్లి:** పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త, ఆర్‌ఎంపీ వైద్యుడు పొట్లూరి శివయ్యపై టీడీపీ నాయకులు ఈనెల 11న అర్ధరాత్రి మారణాయుధాలతో హత్యాయత్నం చేసిన విషయం పాఠక విధితమే. ఘటనలో కుడి చేతిపై కత్తిపోటుకు గురైన శివయ్య సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పట్టించుకోకపోవడంతో జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి సీసీ ఫుటేజ్ రికార్డు అందజేసి, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్ బాబు బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో టీడీపీ నాయకులు శాఖమూరి నరేష్, కట్టమూరు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తూమాటి గోపి కృష్ణ, మందడపు హరి సూర్యనారాయణలను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

## కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెన్యూవల్ చేయాలి

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఏపీ మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను తక్షణమే రెన్యూవల్ చేయాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం రోజునే మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయులను రెన్యూవల్ చేయాల్సి ఉండగా, ప్రభుత్వం ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 149, పల్నాడు జిల్లాలో 14 మోడల్ స్కూళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఇంగ్లిషు మీడియంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య





ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

అందిస్తున్న మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెన్యూవల్ చేయడంతో పాటు, సమస్యలు పరిష్కరించాలని నూతన విద్యాశాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఆయన హామీ ఇచ్చారు.

## డేటా సైన్స్‌లో విస్తృత పరిశోధనలు చేయాలి

ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్

**చేబ్రోలు:** విద్యార్థులు డైటా సైన్స్‌పై విస్తృత పరిశోధనలు చేయాలని ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి



విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మేథమ్యాటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న కాన్ఫరెన్స్‌ను హైబ్రిడ్ మోడ్‌లో (ఆన్‌లైన్ అండ్ ఆఫ్ లైన్) గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ మేథమ్యాటిక్స్, స్టాటిస్టిక్స్‌లో ప్రావీణ్యం పొందిన విద్యార్థులు భవిష్యత్‌లో డేటాసైన్స్‌ను పరిశోధనాంశంగా ఎంచుకోవాలన్నారు. ప్రస్తుతం అన్ని మల్టీ నేషనల్ కంపెనీలు డేటా సైన్స్‌ను విరివిగా వినయోగిస్తున్నారని తెలిపారు. ఇందులో ప్రావీణ్యం పొందిన విద్యార్థులకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. విజ్ఞాన్ వీసీ పి.నా



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ వీసీ నాగభూషణ్, డీన్లు

గభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులు అప్‌డేట్ అయితేనే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలరని, నిరంతర అధ్యయనం కొనసాగాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ముఖ్య అతిథిగా హాజరైన సౌది అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నబిల్ మలైకీ విద్యార్థులకు ఆల్‌జీబ్రాలో వస్తున్న సరికొత్త డెవలప్‌మెంట్స్‌ను నిత్యజీవితంలో ఎలా వినియోగించాలో తెలియజేశారు. లెబనాన్‌లోని లెబనీస్ అమెరికన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జుల్కర్‌మైన్ సబిర్ విద్యార్థులకు న్యూమరల్ నెట్‌వర్క్ సిస్టమ్‌లోని మెళకువలను వివరించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాగులో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

**బల్లికురవ:** రైతులు సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పాటు మెలుకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ సూచించారు. బల్లికురవలోని 20 రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏలు, ఇన్‌పుట్ డీలర్లతో గురువారం సాగుకు సమాత్తంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల వారీగా మట్టి నమూనాల సేకరణతో పాటు రైతులకు సకాలంలో వ్యవసాయ ఉపకరణాలు అందించాలని ఆదేశించారు. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విత్తనాలు అందించాలని డీలర్లకు ఆయన సూచించారు. నకిలీ విత్తనాలతో రైతు పెట్టుబడులు కోల్పోయి తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించుకోవాలని రైతులకు సూచించంచారు. కార్యక్రమంలో మార్టూరు ఏడీఏ కె.వి. శ్రీనివాసరావు, బాపట్ల టెక్నికల్ ఏవో తిరుమలరావు, బల్లికురవ ఏవో ఎస్.వి.పి.కుమారి పాల్గొన్నారు.



## గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద మృతి

**చేబ్రోలు:** వడ్లమూడి గ్రామ పరిధిలో గుర్తుతెలియని మహిళ అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. సంగం జాగర్లమూడి రైల్వే ట్రాక్‌కు సమీపంలో సుమారు వంద మీటర్ల దూరంలో ఖాళీ ప్రదేశంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్‌ఐ పి.మహేష్




మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్‌ఐ

కుమార్ ఘటనాస్థలానికి వెళ్లి మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి కాదని స్థానికులు చెబుతున్నారు. సుమారు నాలుగు రోజుల కిందట మరణించి ఉండొచ్చని, 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయసుఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలు ఆరెంజ్ రంగు జాకెట్‌తో కూడిన వైట్ కలర్ చీరను ధరించి ఉంది. చేతులకు కంకణాలు, చెప్పులు, మెడలో ప్లాస్టిక్ నల్ల బీడ్స్ చైన్ ఉన్నాయి. నిర్జన ప్రదేశంలో మృతి చెందిన గుర్తు తెలియని మహిళను హత్య చేశారా లేక ఆత్మహత్యకు పాల్పడిందా అనేది పోస్టుమార్టం రిపోర్టు ద్వారా తెలియాల్సి ఉంది. గుంటూరు క్లూస్ టీం బృందం వివరాలను సేకరించింది. వడ్లమూడి వీఆర్వో ఫిర్యాదు మేరకు పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు పర్యవేక్షణలో చేబ్రోలు ఎస్‌ఐ పి. మహేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

## చెట్ల పెంపకంతోనే మానవ మనుగడ

**రేపల్లె రూరల్:** మానవాళి మనగడకు ప్రాణాధారమైన చెట్లను ప్రతి ఒక్కరూ పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ మట్టా జ్యోత్స్న అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పట్టణంలోని త్రిబుల్ ఎస్ హైస్కూలులో గురువారం వన మహోత్సవం నిర్వహించారు. జ్యోత్స్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. చెట్ల నరికివేతతో వాతావరణంలో కార్బండయాక్సైడ్ పెరిగి ఓజోన్ పొర దెబ్బతింటోందని తెలిపారు. మొక్కల పెంపకంతోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. మొక్కల్ని రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రతి పుట్టిన రోజుకు ఒక మొక్కను నాటి దాన్ని పెంచి పోషించే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని భవిత స్కూలును సందర్శించారు. ప్రత్యేక అవసరాల కలిగిన చిన్నారులతో కాసేపు మాట్లాడి రికార్డుల్ని పరిశీలించారు. చిన్నారుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని స్పెషల్ ఎడ్యుకేటర్లకు వివరించారు. కార్యక్రమంలో త్రిబుల్ ఎస్ స్కూల్ హెచ్‌ఎం మణిమాల, భవిత స్కూల్ స్పెషల్ ఎడ్యుకేటర్ అనూరాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జ్యోత్స్న తదితరులు

**మొక్కల పెంపకం ఉద్యమంగా చేపట్టాలి**

**బల్లికురవ:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి విద్యార్థి ఓ మొక్కను నాటి పెంచి పోషించాలని జిల్లా సమగ్ర శిక్ష జీసీడీవో చారులత, ఎఫ్ఏవో షేక్ సైదావలి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం బల్లికురవలోని ఉన్నత పాఠశాల, ఎమ్మార్సీ కార్యాలయం, భవిత కేంద్రలో విద్యార్థులతో మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టారు. ఎంఈవోలు వస్త్రం నాయక్, రమేష్‌బాబులు మట్లాడుతూ మొక్కలతోనే సకాలంలో వర్షాలు కురుస్తాయని తెలిపారు. నేడు మొక్కల్ని అంతం చేయడం వల్లే ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. మొక్కల పెంపకాన్ని ఉద్యమంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ కె. సరళకుమారి హెచ్‌ఎం కె. హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.